క్లుప్తంగా

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

ముదిగుబ్బ: సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని 7,8 వార్డులలో స్థానిక నాయకులతో కలిసి ఆయన గుడ్‌మార్నింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల లబ్ధి గురించి ఆరా తీశారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లాగుండ్ల భాస్కర్, సేవేనాయక్ పాల్గొన్నారు.

ఇంటి వద్దనే వైద్యసేవలు

నల్లచెరువు: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి డాక్టర్ గణేనాయక్ శనివారం ఉప్పార్లపల్లిలో పర్యటించారు. దివ్యాంగులకు, గర్భిణులు, బాలింతలకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అంగన్‌వాడి కేంద్రంలోని పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షలు చేసి దగ్గు, జలుబు ఉన్న పిల్లలకు మందులు పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి మంచానికే పరిమితమైన వృద్ధులకు వైద్య సేవలు అందించారు.

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు

కదిరి అర్బన్: మండల పరిధిలోని పట్నం గ్రామంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుకు ఈ నెల 27వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ సుధామణి శనివారం ఓ ప్రకటనలో సూచించారు. ఈ పోస్టును ఓసీ జనరల్‌కు కేటాయించినట్లు తెలిపారు.

గాండ్లపెంట: మండల పరిధిలోని కటారుపల్లి, మలమీదపల్లి గ్రామాల్లో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టులకు ఆయా గ్రామాల్లో అర్హులైన యువతి,యువకులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ అంజినప్ప శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కటారుపల్లిలో-2, మలమీదపల్లిలో-1 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

సచివాలయం తనిఖీ

నల్లచెరువు: తలమర్లవాండ్ల పల్లి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ శకుంతల శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. యూనిఫాం ధరించి విధులకు హాజరు కావాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు సక్రమంగా అందించాలని వలంటీర్లు సూచించారు.

రేకుల ఏర్పాటుకు సహకారం

నల్లచెరువు: మండల పరిధిలోని శ్రీ పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రదక్షిణలు చేయడానికి వీలుగా రేకుల నిర్మాణానికి శ్రీ ఖాద్రి లక్ష్మినరసింహస్వామి ఆలయ మాజీ చైర్మన్ కాంబోజి రెడ్డెప్ప శెట్టి ముందుకు వచ్చినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి శనివారం తెలిపారు.

ఖాద్రీశుని ఆలయం కిటకిట



క్యూలైన్‌లో దర్శనం కోసం వేచిఉన్న భక్తులు

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారికి విశేష పూజలు నిర్వహించడంతో కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా చిత్తూరు, వైఎస్సార్ జిల్లాలు, కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీఖాద్రీశుని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దివ్యాంగ పిల్లలకు కంటి పరీక్షలు

కదిరి అర్బన్: మొటుకుపల్లి ఆర్డీటీ పాఠశాలలో చదువుతున్న దివ్యాంగ పిల్లలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో శనివారం 68 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 6 మంది చిన్నారులకు కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. నలుగురిని హయ్యర్ ఇనిస్టిట్యూట్‌కు రెఫర్ చేశారు. విశ్రాంత తహసీల్దార్ రియాజుద్దీన్, ఐ ఇనిస్టిట్యూట్ కో ఆర్డీనేటర్ రఫిక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కదిరి అర్బన్: చలమకుంట్లపల్లిలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న సర్పంచ్ నారపరెడ్డిని శనివారం ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి పరామర్శించారు. మెడికల్‌రిపోర్ట్‌ను పరిశీలించి తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ ప్రకాష్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్, పట్నం సర్పంచ్ చలపతినాయక్ పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు ఆర్థిక భరోసా

అక్కచెల్లెమ్మలకు పొదుపు సంఘాల పేరిట ఉన్న రుణాల మొత్తాన్ని నాలుగు దఫాల్లో నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేస్తామని పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారు. ఈక్రమంలో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మూడో విడత సాయం శనివారం మహిళల బ్యాంకు ఖాతాలకు జమ అయ్యింది. దీంతో ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, రాప్తాడు నియోజకవర్గాల్లో పొదుపు సంఘాల మహిళలు సంబరాలు చేసుకున్నారు. సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకాలు చేశారు.

- వైఎస్సార్ ఆసరా కింద నగదు బదిలీతో సంబరాలు
- సీఎం వైఎస్ జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు
- ఇచ్చిన హామీని నెరవేర్చారు: కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డి



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

కదిరి టౌన్: మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా మూడో విడత నగదు బదిలీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టీవీల ద్వారా సీఎం ప్రసంగాన్ని విన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నపుడు మహిళలను ఏ విధంగా మోసం చేశారో ఒకసారి గుర్తుంచుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ ఆసరా కింద ఇప్పటి వరకు మూడు విడతలుగా రూ.19,178.17 కోట్లు పొదుపు సంఘాల మహిళల ఖాతాలకు జమ చేశారన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు ప్రతి అక్క చెల్లెమ్మ అండగా ఉండాలన్నారు. మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్, మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అమడగూరు: ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘ సభ్యులతో ఏపీఎం గోపాల్ సమావేశాన్ని నిర్వహించి వైఎస్సార్ ఆసరా కింద నగదు బదిలీని టీవీల ద్వారా వీక్షించారు. మండలంలోని 3,760 మంది మహిళలకు రూ.2,69,38,902 జమ అయినట్లు పేర్కొన్నారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

గాండ్లపెంట: మండలంలోని 339 సంఘాల్లో ఉన్న 3390 మంది సభ్యులకు రూ.1,99,61,272 వారి ఖాతాల్లో జమ కానుంది.

నల్లమాడ: మండలంలోని 568 డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.4,09,16,312 మంజూరు చేసినట్లు ఏపీఎం జయంతి తెలిపారు. సాధన మండల సమాఖ్య కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, నల్లమాడ పట్టణ కన్వీనర్ వేణుగోపాల్ గౌడ్, సమాఖ్య అధ్యక్షురాలు మోదీనమ్మ, శాంతమ్మ పాల్గొన్నారు. యర్రవంకపల్లిలో సర్పంచ్ రజనీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆసరా ఉత్సవాలు నిర్వహించారు.

తలుపుల: మండలంలో 725 మహిళా సంఘాలకు చెందిన 7180 మంది సభ్యులకు బ్యాంకు ఖాతాల్లో రూ.5,78,64,000 జమ కానుంది.

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్ ఆసరా కింద నగదు జమ కావడంతో పొదుపు సంఘాల మహిళలు సంబరాలు నిర్వహించారు. ఏపీఎం శివమ్మ ఆధ్వర్యంలో పెడపల్లి సర్పంచ్ మంగ్లీబాయి, ఎంపీటీసీ సరస్వతీబాయి ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్ ప్రసంగాన్ని చూసేలా టీవీ ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. మండల వ్యాప్తంగా 127 సంఘాలకు రూ.1.14 కోట్ల నగదు జమ చేసినట్లు చెప్పారు. ఈసందర్భంగా సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండల సమాఖ్య ఉపాధ్యక్షురాలు శివమ్మ, సీసీ రాజశేఖర్, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

పుట్టపర్తి: బుక్కపట్నం మండలంలో 661 సంఘాల్లోని 6671 మంది సభ్యులకు వైఎస్సార్ ఆసరా కింద మూడో విడతలో రూ.4.93 కోట్లు వారి ఖాతాల్లో జమ అయినట్లు ఏపీఎం నాగమణి తెలిపారు. బుక్కపట్నం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా ఉత్సవాల్లో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, జిల్లా వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

బత్తలపల్లి: మండల వ్యాప్తంగా గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలలో వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. 670 పొదుపు సంఘాల్లోని 6,485 మంది సభ్యులకు రూ.5,63,32,418లు జమ అయినట్లు ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి తెలిపారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఏపీఎం సుదర్శన్‌రాజు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద మహిళా సంఘాల సభ్యులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఏపీఎం రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని 921 మహిళా సంఘాల్లోని 9,291 మంది సభ్యుల ఖాతాల్లో రూ.8,94,71,655 జమ అయ్యిందన్నారు.

కనగానపల్లి: మండలంలోని 664 డ్వాక్రా సంఘాల్లో 6,700 మంది మహిళలకు రూ.5.23 కోట్ల రుణమాఫీ అయినట్లు ఏపీఎం హేమలత తెలిపారు. మూడో విడత ఆసరా నిధులు విడుదల సందర్భంగా స్థానిక వైకేపీ కార్యాలయంలో డ్వాక్రా సంఘాల మహిళలు వీరబ్రహేంద్ర మహిళా మండల సమాఖ్య లీడర్ల ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.



కనగానపల్లిలో సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు



నల్లమాడలో జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం



తలుపుల: ఈదులకుంట్లపల్లి సచివాలయంలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని వీక్షిస్తున్న దృశ్యం



బుక్కపట్నంలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి,పొదుపు మహిళలు

ప్రశాంతవదనంతో పరీక్షలు రాస్తే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులకు విద్యాసామగ్రి అందిస్తున్న డీఈఓ మీనాక్షి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ధర్మవరం అర్బన్: ప్రతి విద్యార్థీ లక్ష్యాన్ని ఏర్పరుచుకొని సాధన చేస్తే విజయం వరిస్తుందని డీఈఓ మీనాక్షిదేవి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సూచించారు. పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులు నిర్వహించిన సరస్వతిపూజలో పాల్గొని మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో బాగా రాణించాలన్నారు. ఒత్తిడికి గురైతే సమాధానాలు మర్చిపోయే ప్రమాదముందని తెలిపారు. ప్రశ్నలను చదివి అర్థం చేసుకుని అనంతరం సమాధానాలు రాయాలని సూచించారు. ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు కరాటే ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందించారు.పాఠశాల హెచ్‌ఎం మేరి వరకుమారి, పాఠశాల విద్యా కమిటీ చైర్‌పర్సన్ లావణ్య, వైస్ చైర్‌పర్సన్ ఉమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సరస్వతీ పూజ

ధర్మవరం రూరల్: దర్శనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు సరస్వతీ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పదవ తరగతి పరీక్షలలో మంచి మార్కులు సాధించేలా ఆశీర్వదించాలని అమ్మవారిని ప్రార్థించారు. గత ఏడాది పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన స్పందన అనే విద్యార్థినికి గ్రామానికి చెందిన కానిస్టేబుల్ శ్రీరాములు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. ప్రధానోపాధ్యాయులు గోపాలక్రిష్ణ పాల్గొన్నారు.

న్యాయవాదిని బెదిరించడం తగదు

కదిరి టౌన్: కదిరికి చెందిన న్యాయవాది సురేంద్ర చౌదరిని ఓ వ్యక్తి బ్లాక్ మెయిల్ చేస్తూ చంపుతానని బెదిరిస్తున్నారని సీనియర్ న్యాయవాదులు ఆరోపించారు. శనివారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాది ప్రసాద్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ గత నెల 28వ తేదిన లారీలో 19 ఎద్దులు, 18 గేదేలు, 4 దున్న పోతులను తరలిస్తుండగా తనకల్లు పోలీసులు పట్టుకున్నారన్నారు. అయితే వాటిని కబేళకు తరలించడం లేదని, అవి తమకు చెందిన పశువులు అని వైఎస్సార్ జిల్లాకు చెందిన రైతులు న్యాయవాది సురేంద్ర ద్వారా కదిరి కోర్టును ఆశ్రయించారన్నారు. విచారణ అనంతరం పశువులను రైతులకు అప్పగించారన్నారు. అయితే పశువులను అప్పగించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ తిరుపతికి చెందిన మేడా లోకేష్ అనే వ్యక్తి న్యాయవాది సురేంద్రకు వాట్సాప్ ద్వారా సందేశాలు పంపుతూ డబ్బు డిమాండ్ చేస్తున్నారన్నారు. న్యాయవాది సురేంద్రచౌదరికి ప్రాణహాని ఉందన్నారు. మేడా లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో న్యాయవాదులు సత్యనారాయణ, గురులింగస్వామి, లోకేశ్వర్‌రెడ్డి, భైరవప్రసాద్, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు విద్యార్థుల ఎంపిక



పుట్టపర్తి అర్బన్: ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



విద్యార్థి యుగంధర్



జ్యోత్స్న

పుట్టపర్తి అర్బన్: ఇటీవల నిర్వహించిన నేషనల్ మీన్స్ కం మెరిట్ పరీక్షలో పుట్టపర్తి మండలం జగరాజుపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థులు ముగ్గురు ఉత్తీర్ణత సాధించి ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రమేష్ బాబు పేర్కొన్నారు. బ్రాహ్మణపల్లికి చెందిన 8వ తరగతి విద్యార్థిని వరలక్ష్మీబాయి, కొండంపల్లి తండాకు చెందిన వర్షా, పుట్టపర్తికి చెందిన ధనుశ్రీకి యేడాదికి స్కాలర్‌షిప్ కింద రూ.12 వేలు ఆర్థిక సహాయం నాలుగు సంవత్సరాలపాటు అందిస్తారన్నారు.

పుట్టపర్తి: బుక్కపట్నం ఉన్నత పాఠశాలకు చెందిన యుగంధర్ అనే విద్యార్థి ఉపకార వేతనానికి ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం హరికిరణ్ శనివారం తెలిపారు.

తనకల్లు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని నేసే జ్యోత్స్న ఉపకార వేతనానికి ఎంపికైనట్లు హెచ్‌ఎం లియాఖత్ అలీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పంచాయతీలకు ఆదాయ వనరులు సమకూర్చుతాం

- డీపీఓ విజయ్‌కుమార్‌రెడ్డి



అధికారులకు సూచనలు ఇస్తున్న డీపీఓ విజయ్‌కుమార్‌రెడ్డి

తనకల్లు: గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్త నుంచి సంపదను సృష్టించి, గ్రామ పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చుతామని జిల్లా పంచాయతీ అధికారి విజయకుమార్‌రెడ్డి అన్నారు. స్థానికంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో ఎన్‌పీ కుంట, నల్లచెరువు మండలాల్లోని ధనియాన్‌చెరువు, పెడబల్లి, నల్లచెరువు, ఓరువాయి పంచాయతీల సర్పంచులు, ఉప సర్పంచులు, కార్యదర్శులు, ఇంజినీరింగ్, అగ్రికల్చర్, వెటర్నరీ అసిస్టెంట్లు, గ్రీన్ అంబాసిడర్లకు శనివారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో తనకల్లును లోకల్ ట్రెనింగ్ సెంటర్లుగా ప్రభుత్వం ఎంపిక చేసినట్లు తెలిపారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలలో వర్మీ కంపోస్టు తయారీ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డులో వర్మీ కంపోస్టు తయారీ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తనకల్లు, నల్లచెరువు ఎంపీడీఓలు పూల నరసింహులు, శకుంతలమ్మ, ఈఓఆర్డీలు ఆనందయ్య, మనోహర్, దివాకర్ పాల్గొన్నారు.

పుట్టపర్తి అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు వైఎస్సార్ సీపీ నాయకుల సవాల్
- ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డిని విమర్శించే స్థాయి నీకు లేదని మండిపాటు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నల్లమాడ: ఎవరి హయాంలో పుట్టపర్తి నియోజకవర్గం అభివృద్ధి చెందిందో బహిరంగ చర్చకు సిద్ధం కావాలని టీడీపీ నేత నారా లోకేష్‌కు వైఎస్సార్ సీపీ నాయకులు సవాల్ విసిరారు. యువగళం పాదయాత్రలో భాగంగా శనివారం ఓడీ చెరువులో జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిపై నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలను వైఎస్సార్ సీపీ నాయకులు ఖండించారు. వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ పొరకల రామాంజనేయులు నివాసగృహంలో శనివారం రాత్రి నల్లమాడ మార్కెట్ యార్డు చైర్మెన్ శ్రీనివాస రెడ్డి, డైరెక్టర్లు ఆసాది గంగిశెట్టి, సేవేనాయక్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, పట్టణ కన్వీనర్ వేణుగోపాల్ గౌడ్ విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే దుద్దుకుంట గురించి మాట్లాడే అర్హత లోకేష్‌కు లేదన్నారు. నల్లమాడకు మార్కెట్‌యార్డు, నల్లమాడ, ఓడీ చెరువు, పుట్టపర్తి మండలాల మీదుగా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, ముదిగుబ్బ నుంచి బుక్కపట్నం మీదుగా ఫోర్‌వే సాధించిన ఘనత ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దశాబ్దాల తరబడి రోడ్డు సౌకర్యం లేని మారుమూల గ్రామాలకు రోడ్లు వేశామన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాలను కోట్లలో కాజేసిన మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డికి ఆ వర్గాల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. అమడగూరు మండలం మహమ్మదాబాద్‌లో సమస్యలపై నిలదీసిన దళిత యువకుడి చేత పల్లె రఘునాథరెడ్డి కాళ్లు పట్టించుకున్నాడన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక అదే యువకుడిని సర్పంచ్‌ను చేసిన ఘనత దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిది అని అన్నారు. నల్లమాడ మండలం దొన్నికోటలో తాగేందుకు నీళ్లు లేవని మహిళలు నిరసన తెలిపితే పల్లె రఘునాథరెడ్డి బిందెలను కాళ్లతో తన్నిన ఘటనను నేటికీ ప్రజలు మరవలేదన్నారు. అదే సమయంలో దుద్దుకుంట ఫౌండేషన్ ట్యాంకర్ల ద్వారా దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మారుమూల గ్రామాలకు తాగునీరు సరఫరా చేశారని గుర్తుచేశారు.

వేలం ఖరారు

నల్లమాడ: నల్లమాడ వారపు సంత వేలం పాటను శనివారం ఒకటో గ్రామ సచివాలయ ప్రాంగణంలో సర్పంచ్ భారతి అధ్యక్షతన నిర్వహించారు. గ్రామానికి చెందిన ఎస్.నజీర్ రూ.3 లక్షలతో వారపు సంత హక్కులు దక్కించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి తెలిపారు.

జీఓ 52 రద్దు చేయాలి

పుట్టపర్తి అర్బన్: వాల్మీకి, బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి జారీ చేసిన జీఓ 52ను ఉపసంహరించుకోవాలని శ్రీసత్యసాయి జిల్లా గిరిజన సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాయి. శనివారం బంజారా నాయకులు పుట్టపర్తిలో ర్యాలీగా వచ్చి కలెక్టర్ బసంత్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక

తాడిమర్రి: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో శనివారం వృద్ధులకు వైద్యాధికారి ఉరుకుందప్ప ఆధ్వర్యంలో కంటి వైద్యులు కంటి పరీక్షలు చేశారు. 40 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు.

వలంటీర్లకు అభినందన

నల్లచెరువు: రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ అనంతపురంలో నిర్వహించిన శిక్షణలో పాల్గొని తిరిగి వచ్చిన వలంటీర్లు ముబారక్, యోగేశ్వర్, ఆశా కార్యకర్త స్వర్ణలతను ఎంపీడీఓ అభినందించారు.

క్షయ రోగిని దత్తత తీసుకున్న డీపీఎంఓ

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి పట్టణానికి చెందిన క్షయవ్యాధిగ్రస్తున్ని డీపీఎంఓ డాక్టర్ కేసీ కుల్లాయప్పనాయక్ తన జన్మదినం సందర్భంగా దత్తత తీసుకున్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ బసంత్‌కుమార్ ఇచ్చిన పిలుపు మేరకు క్షయవ్యాధిగ్రస్తున్ని శనివారం ఆయన దత్తతకు తీసుకొని పోషకాహారం అందజేశారు. జిల్లా అర్బన్ సూపర్‌వైజర్ అబీద్‌బాషా, హెల్త్ విజిటర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

పంట రుణాలు రెన్యూవల్ చేసుకోవాలి

కదిరి అర్బన్: సైదాపురం సహకార పరపతి సంఘంలో పంట రుణాలు తీసుకున్న రైతులు ఈ నెల 31 లోపు వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని సంఘం చైర్మన్ ఆంజనేయులు, సీఈఓ బయారెడ్డి శనివారం పేర్కొన్నారు.

ఆలయాలకు విరాళాలు

చెన్నేకొత్తపల్లి: న్యామద్దల గ్రామంలోని పలు ఆలయాలకు శ్రీరామనవమి సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామకృష్ణా రెడ్డి శనివారం విరాళాలు అందజేశారు. జ్యోతుల ఉత్సవాలకు రూ.10వేలు, రాతిదూలం లాగుడు పోటీలకు రూ.6 వేలు, పల్లాపురమ్మ ఆలయ మరమ్మతులకు రూ.27,000, అన్నదానానికి రూ.10వేలు అందించారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



గాండ్లపెంట: బయ్యారెడ్డిపల్లిలో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

గాండ్లపెంట: వాల్మీకి బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటామని సామాలగొంది పంచాయతీ బయ్యారెడ్డిపల్లికి చెందిన వాల్మీకి సంఘం నాయకులు అన్నారు. శనివారం గ్రామంలో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జిల్లా వాల్మీకి సంఘం నాయకులు మేకల శివప్రసాద్, శ్రీనివాసులు, మేకలరాము, రెడ్డెప్ప, భార్గవి, మనీషా, లక్ష్మీదేవి, లావణ్య పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి కేంద్రానికి పంపడం చారిత్రక నిర్ణయమని బిషప్ కౌన్సిల్ సభ్యుడు రమేష్ బాబు పేర్కొన్నారు. ఎనుములపల్లి ఎల్‌బేతేల్ చర్చిలో శనివారం సమావేశం ఏర్పాటు చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. బిషప్ కౌన్సిల్ సభ్యులు ప్రతినిధులు పాస్టర్ రజారత్నం పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభం

కదిరి అర్బన్: విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి ఉండాలని ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. స్మిత సూచించారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు శనివారం ఎర్రగుంటపల్లి, సైదాపురం ఎస్సీకాలనీలో ఉపాధి లేని యువతను సర్వే నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సేవా నిరతిని చాటుకునేందుకు ఎన్ఎస్ఎస్ చక్కని వేదిక అని అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజ్‌మహ్మద్‌తో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

చెన్నేకొత్తపల్లి: న్యామద్దల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ధర్మవరానికి చెందిన ఆత్మీయ ట్రస్ట్ ఉచితంగా పరీక్షా సామగ్రిని శనివారం పంపిణీ చేసింది. సంస్థ చైర్మన్ సూర్య ప్రకాష్, సర్పంచ్ రామకృష్ణా రెడ్డి, హెచ్‌ఎం రామచంద్ర, పరమేశ్వర రెడ్డి, రాజశేఖర్, రంజిత్, ఎంకె. నబీ, రామమోహన్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

కొత్తచెరువు: శ్రీసత్యసాయి జిల్లాలో త్వరలోనే వైఎస్సార్ సీపీ అనుబంధ ట్రేడ్ యూనియన్ నూతన కమిటీలను ఏర్పాటు చేసి వైఎస్సార్‌సీపీ బలోపేతం దిశగా ముందుకెళతామని ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అంగడి సోమశేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో రెండురోజుల క్రితం తాడేపల్లిలో పార్టీ అనుబంధ విభాగాల వారిగా నిర్వహించిన సమావేశం జరిగిందని, రాష్ట్ర నాయకులు సూచించిన మేరకు పార్టీని బలోపేతం చేస్తామని అన్నారు.

28న కౌలు రైతుల రాష్ట్ర సదస్సు

బత్తలపల్లి: కౌలు రైతుల రాష్ట్ర సదస్సును ఈ నెల 28న విజయవాడలో దాసరి భవన్, హనుమాన్‌పేటలో నిర్వహిస్తున్నట్లు ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.కాటమయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సీఐటీయూసీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామన్నారు. రైతులు హాజరై జయప్రదం చేయాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కెవీ చలపతి, నాయకులు కమతం కాటమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీ రమణ, జిల్లా సహాయ కార్యదర్శి గోవిందరెడ్డి పాల్గొన్నారు.

వేలం వాయిదా

చెన్నేకొత్తపల్లి : స్థానిక మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన వారపుసంత పంచాయతీ రూముల వేలం పాట వాయిదా వేసినట్లు ఎంపీడీఓ అశోక్‌నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. వేలం పాట ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామన్నారు.

డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

తనకల్లు: రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని డీలర్ల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పరంధామరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటరంగారెడ్డి విజ్ఞప్తి చేశారు. స్థానిక పీవీకే ఫంక్షన్‌హాల్‌లో జిల్లా కోశాధికారి చిదానంద రెడ్డి ఆధ్వర్యంలో తనకల్లు, నల్లచెరువు మండలాల డీలర్లతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. డీలర్లకు కమీషన్ మొత్తాన్ని పెంచాలని, డీలర్లు ప్రమాదవశాత్తు మరణిస్తే అంత్యక్రియల ఖర్చును ప్రభుత్వమే చెల్లించాలని, డీలర్లకు ఇన్సూరెన్స్ చేయించాలని కోరారు.